విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య

www.suryaa.news



ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్

22-2-2026

వెల: రూ.5/-

పేజీలు: 8

సంపుటి: 01

సంచిక: 172

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# ప్రేమ వివాహంపై పెద్దలకు సమాచారం

### రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచే తల్లిదండ్రులకు ఇన్ఫర్మేషన్

### గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం


### వివాదాలకు అడ్డుకట్ట వేసేందుకేనని వెల్లడి

సనాతన ధర్మం ఉన్న భారత్ లో ప్రేమ వివాహాలు అనేవి చాలా తక్కువ. పెద్దల కుదిర్చిన వివాహంతోనే జంట ప్రేమలో పడడం ఆనవాయితీ. కానీ కాలం మరుతున్నా కొద్దీ యువతీ యువకుల మధ్య ఆకర్షణ పెరగడం, ఇది ప్రేమకు దారి తీయడం, పెద్దలు ఒప్పుకోకుంటే రిజిస్ట్రర్ మ్యారేజ్ తీసుకోవడం.. ఇదంతా కామన్ అయిపోయింది. ప్రేమ వివాహాలు ఇప్పుడు భారత సమాజంలో అరుదైన విషయం కాకుండా పోయింది.

(పభాత సూర్య తెలంగాణ బ్యూరో )

యువత తమ జీవిత భాగస్వామిని స్వయంగా ఎంపిక చేసుకోవడం సాధారణ ప్రక్రియగా మారుతోంది. అయితే ఈ స్వేచ్ఛకు సమాంతరంగా కుటుంబాల ఆందోళనలు, అపార్థాలు, తప్పుడు సమాచారం ఆధారంగా జరిగే వివాదాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అది దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గుజరాత్ మ్యారేజ్ రిజిస్ట్రేషన్ రూల్స్‌లో మార్పులు చేస్తూ, ప్రేమ వివాహం చేసుకునే జంట తమ పెద్దలకు సమాచారం ఇచ్చినట్టు డిక్లరేషన్ తప్పనిసరి చేయాలని

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!



2లో



## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం

కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక



# కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

### అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి

### డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు



2లో

- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**వికారాబాద్,ప్రభాత సూర్య :** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల

## పసి పిల్లలపై లైంగిక దాడులు



33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు

మరణశిక్ష విధించిన సిబిఐ కోర్టు

## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు

పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి

పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి



8లో




### వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆస్తుల వేలానికి సిద్ధమైన ఎల్.ఐ.సీ.

- వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుకకు బిగ్ షాకిచ్చిన ఎల్ఐసీ
- ఆస్తుల వేలానికి సిద్ధమైన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్
- మార్చి 24న ఆస్తుల వేలంకు ప్రకటన జారీ

2లో

# ప్రపంచంపై మళ్లీ పిడుగు

- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- సుప్రీం తీర్పుపై ట్రంప్ తీవ్ర నిరాశ
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక



**న్యూఢిల్లీ,ప్రభాత సూర్య :** ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 6 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్?హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది.అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్ నుంచి సంతకం చేయడం తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.



# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

## గ్రామీణ ప్రాంతాల్లో గడచిన ద 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

**హైదరాబాద్,ప్రభాత సూర్య :** తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది.



## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,ప్రభాత సూర్య :** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు

2లో



# ప్రేమ వివాహంపై పెద్దలకు సమాచారం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో పెళ్లికి దరఖాస్తు చేసుకునే సమయంలో ఈ డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా అమ్మాయి తల్లిదండ్రులకు అప్లికేషన్ ప్రతిని అధికారులు స్వయంగా షేర్ చేయాలనే నియమం కూడా చేసింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ రాష్ట్ర హోంమంత్రి హర్ష సంఘ్వీ ప్రకటన చేశారు. తప్పుడు సమాచారం, మోసపూరిత వివరాలతో వివాహాలు జరగకుండా ఉండేందుకే ఈ మార్పులు చేసినట్లు చెప్పారు. కొన్ని సందర్భాల్లో యువతీ యువకులు తల్లిదండ్రులకు తెలియకుండా పెళ్లి చేసుకోవడం వల్ల కుటుంబ వివాదాలు, చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముందుగానే సమాచారం ఉంటే అనవసర అపోహలు తగ్గుతాయని భావిస్తున్నట్లు తెలిపారు.

**భిన్నాభిప్రాయాలు..**

గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక వర్గం దీనిని కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే చర్యగా చూస్తోంది. పెళ్లి అనేది కేవలం ఇద్దరి మధ్య ఒప్పందం కాదు.. రెండు కుటుంబాల కలయిక అనే భావన భారతీయ సమాజంలో ఆది నుంచి బలంగా ఉంది. పెద్దలకు ముందుగానే సమాచారం ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను నివారించవచ్చని వారు అంటున్నారు. మరోవైపు, వ్యక్తిగత స్వేచ్ఛపై ఇది ప్రభావం చూపుతుందనే విమర్శలు లేకపోలేదు. వయోజనులైన వ్యక్తులు తమ జీవిత నిర్ణయాలు స్వతంత్రంగా తీసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందేనదే. అలాంటి సందర్భంలో పెద్దలకు సమాచారం తప్పనిసరి చేయడం వ్యక్తి గత గోప్యతకు విరుద్ధమని కొందరు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కుటుంబ వ్యతిరేకత, హానర్ క్రైమ్ భయం ఉన్న సందర్భాల్లో ఈ నిబంధన యువజంటల భద్రతపై ప్రభావం చూపుతుందా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

# గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది. 2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్-?2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024-25 మరియు 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం ఖఓఉజ 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్?2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# పసి పిల్లలపై లైంగిక దాడులు

**లక్నోఫిబ్రవరి21 ప్రభాత సూర్య :** అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010-2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య :** దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది.

# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు.

# దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

**గౌహతి, ప్రభాత సూర్య :** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు. రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు.

# వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆస్తుల వేలానికి సిద్ధమైన ఎల్.ఐ.సీ.



అమరావతి: వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుకకు ఎల్ఐసీ బిగ్ షాకిచ్చింది. ఆమె ఆస్తులను వేలం వేసేందుకు సిద్ధమైంది. ఆస్తులను తనకాపెట్టి బుట్టా రేణుకా, ఆమె భర్త నీలకంఠ ఎల్ఐసీ నుంచి రూ.340 కోట్ల అప్పు తీసుకున్నారు. ఇప్పుడు వడ్డీతో సహా రూ.782 కోట్లు అయ్యాయి. ఈ మేరకు ఎల్ఐసీ ఒక ప్రకటన విడుదల చేసింది. రుణ పరిష్కారం కోసం గతంలో నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇరువర్గాల మధ్య ఎలాంటి ప్రత్యామ్నాయ ఒప్పందాలు కుదరకపోవడంతో ఎల్ఐసీ సంస్థ చివరకు వేలం ప్రక్రియను వేగవంతం చేసింది. హైదరాబాద్ కేపీహెచ్‌పీ కాలనీలో సర్వే నెంబర్ 1009లోని 3823 చదరపు గజాల స్థలాన్ని వేలం వేయడానికి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఫైనాన్స్ బెంగళూరు బ్రాంచి అధికారిక ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థలంలో మెరీడియన్ స్కూల్ కొనసాగుతుంది. అయితే, మార్చి 24న ఈ స్థలాన్ని ఎల్ఐసీ వేలం వేయబోతోంది. మెరిడియన్ స్కూల్ ఉన్న ఆస్తి కనీసం విలువ రూ.65కోట్లుగా అధికారులు నిర్ణయించారు. బుట్టా రేణుక 2014 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కర్నూలు ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. మళ్లీ 2019 ఎన్నికల సమయానికి తిరిగి వైసీపీ గూటికి చేరుకున్నప్పటికీ.. ఆమెకు టికెట్ దక్కలేదు. వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించారు. 2024 ఎన్నికల్లోనూ ఆమెకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం రాలేదు. ఆ తరువాత ఆమె క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. బుట్టా రేణుక కుటుంబం కేవలం రాజకీయాల్లోనే కాకుండా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటిగా పేరుగాంచిన బుట్టా గ్రూప్ ను నిర్వహిస్తోంది. ఈ గ్రూపు పలు రంగాల్లో విస్తరించింది. విద్యారంగం, ఆటోమొబైల్ రంగం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది.

# మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి – జి రావ్ జి చట్టాన్ని రద్దు చేయాలి

- 2005 – మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించి
- పని ప్రదేశాల్లో కార్మికులకు మౌలిక వసతులు కల్పించి, రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని
- మార్చి 2న ఎండిఓ ఆఫీస్ ముందు జరుగు మహాధర్నాను జయప్రదం చేయండి
- కొండమడుగు నర్సింహ్మా, జెల్లెల్ల పెంటయ్య పిలుపు





**రామన్నపేట, ఫిబ్రవరి 21(ప్రభాత సూర్య ):** మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి – జి రావ్ జి చట్టాన్ని రద్దు చేసి, 2025 – మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, పని ప్రదేశాల్లో కార్మికులకు మౌలిక వసతులు కల్పించి, రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని కోరుతూ మార్చి 2వ తేదీన రామన్నపేట ఎండిఓ ఆఫీసు ముందు నిర్వహిస్తున్న " మహా ధర్నా " లో ఉపాధి హామీ కార్మికులు , వ్యవసాయ కూలీలు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా , జిల్లా ఉపాధ్యక్షులు జెల్లెల్ల పెంటయ్య పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రామన్నపేట ఎండిఓ ఆఫీస్ ముందు నిర్వహిస్తున్న " మహా ధర్నా" ను జయప్రదం చేయాలని రామన్నపేట, వెల్లంకి గ్రామాల్లోని ఉపాధి హామీ ప్రదేశానికి సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం నర్సింహ్మా , పెంటయ్య లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ పేదల బతుకు దెరువును జి రామ్ జి చట్టం దెబ్బతీసిందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కోట్లాది గ్రామీణ పేదలకు జీవించే హక్కు, బతికే ఆధారము, బేరం ఆడేశక్తి ఇచ్చిందని అన్నారు. కొత్త చట్టంలో హక్కులు లేవుని, హామీ లేదని, భద్రత అసలే లేదని ఆవేదన వెలిబుచ్చారు. మోడీ ఉపాధి హామీ స్థానంలో కార్పొరేట్ల లాభాల పథకము తీసుకొచ్చారని అన్నారు. పాత చట్టము ప్రజలకు ఉపయోగపడితే మోడీ తెచ్చిన జిరాంజీ చట్టము గ్రామీణ ధనిక వర్గాలకు, భూసాములకు ఉపయోగప దుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జీరాంజి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులు ఎండకు ఎండుతూ నిలువ నీడ లేక, తాగడానికి నీళ్లు లేక, చేసిన పనికి వారం వారం డబ్బులు రాక, కూలి ఎంతొస్తుందో కూడా తెలియని అయోమయంలో ఉన్నారని అన్నారు. రామన్నపేట మండలంలో గత సంవత్సరము నుండి పే స్లిప్ ఇవ్వరు, జాబు కార్డులో నమోదు చేయరు ఇదేమని అడిగితే పట్టించుకునే నాధుడే ఉండడుని అన్నారు. కొంతమంది ఏపీవోలు జిల్లాలో పది సంవత్సరాల నుండి ఒకే మండలంలో పనిచేయడం వల్ల ఉపాధి హామీ కూలీల కష్టసుఖాలను, వారి యొక్క సమస్యలను పట్టించుకునే విధంగా లేరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుదీర్ఘకాలం ఒకే మండలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందిని, అధికారులను మార్చాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 2న రామన్నపేట ఎండిఓ ఆఫీస్ ముందు నిర్వహిస్తున్న మహాధర్నాలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ, పెంటయ్యలు కోరినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధి హామీ కార్మికులు కూరెల్ల నరసింహ చారి, హనుమంతు, బాలరాజు, నరేందర్, సోములు, లెనిన్, మల్లేష్, రాములు, సురేందర్, మహేష్, స్వామి, సంతోష్, హరీష్, బాబురావు, రజిత, రేణుక, శంకరమ్మ, భాగ్య, మమత, పార్వతమ్మ, కవిత, లక్ష్మమ్మ, పూలమ్మ, చంద్రకళ, సునీత, పూజిత తదితరులు పాల్గొన్నారు.

# యువత అందరికీ ఆదర్శంగా ఉండాలి...







ముస్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ ... తిరునగిరి శ్రీనివాస్..




**ఆలేరు ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య :** చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి అని ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ అన్నారు. ఆలేరు లో పద్మావతి గార్డెన్ లో ఎస్ ఆర్ జూనియర్ కాలేజి వీడ్కోలు కార్యక్రమం శనివారం రోజున నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ కమటం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు ,సీనియర్ జర్నలిస్టు తిరునగరి శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ యువత అందరికీ ఆదర్శంగా ఉండాలని , చెడు అలవాటులకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థి అంటే నియమ నిబంధనలు పాటించాలని సూచించారు .అలాగే సీనియర్ జర్నలిస్ట్ తిరునగరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలో మంచి మార్కులు రావాలని కోరారు. ధైర్యంగా ముందుకు వెళతామని గురువులకు భరోసా ఇవ్వాలని, సంకల్పంతో పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలని అన్నారు. ప్రిన్సిపాల్ ,అధ్యాపకుల బృందం ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కమటం అనురాధ, అనిల్, సుక్క కృష్ణ, సందుల రాజు, దూడల వెంకటేష్, శ్రవణ్, సత్యం , సిద్దిరాజు , అలివేలు, కాంగ్రెస్ నాయకులు ముదికొండ శ్రీకాంత్, దూడల రాజు, పోరెల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దు చేసి రైతులకు కావలసినంత యూరియాను అందజేయాలి.

సిపిఎం పార్టీ అనాజిపురం శాఖ1 కార్యదర్శి ఎదునూరి వెంకటేశం



**భువనగిరి, ఫిబ్రవరి 21( ప్రభాత సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్లైన్ విధానం వలన రైతులకు భారంగా ఉందని వెంటనే యూరియా యాపు ను రద్దు చేయాలనీ సిపిఎం పార్టీ శాఖ1 కార్యదర్శి ఎదునూరి వెంకటేశం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు లేదా రైతు మిత్ర సంఘాల ద్వారా రైతులకు నేరుగా యూరియాను అందించాలని అయన ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం అమలులో ఉన్న యాపు కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి నాట్లు వేసి రెండు నెలలు గడిచిన యూరియా అందుబాటులో లేకపోవటం వలన రైతులు ఆందోళనకు గురవుతున్నారని, స్మార్ట్ ఫోన్ లు లేకపోవటం ఇంటర్నెట్ సమస్యలు, ఆధార్ ఫోన్ లింక్ సమస్యలు పాసుబుక్ వంటి వివరాలు నమోదు చేయటం వంటి అంశాలు రైతులకు మరింత భారంగా మారుతున్నాయని విమర్శించారు.ఏదోలా చేసి యపు లో వివరాలు నమోదు చేసాక ఓటీపీ కోసం సమయం పడుతుందని అది వచ్చాక చూస్తే యూరియా అప్పటికే యూరియా ఐపోతుందని అయన అన్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్యలు ఉన్న నేపథ్యంలో యాపు ద్వారా యూరియా తీసుకోవటం కష్టంగా ఉందని, రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంవరిచుకొని రైతులకు కావలసినంత యూరియాను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వైనాల లింగన్న దంపతులకు ఘన స్వాగతం పలికి సన్మానించిన నాగవీధి రజక సంఘం నాయకులు






**జయశంకర్ జిల్లా, ఫిబ్రవరి 21(ప్రభాత సూర్య):** జయశంకర్ జిల్లా గణపూర్ మండలం నాగవీధిలో వంచనగిరి రమేష్ నిర్వహించిన నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వైనాల లింగన్న , వారి సతీమణి వైనాల పద్మ శనివారం విచ్చేసి వేడుకకు మరింత శోభ చేకూర్చారు. రజక సమాజ అభ్యున్నతికి వైనాల లింగన్న దంపతులు చేస్తున్న సేవలు, సమాజంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అందిస్తున్న తోడ్పాటు గురించి పలువురు ప్రశంసించారు. సమాజ ఐక్యత, సేవా భావం పెంపొందించడంలో వారి పాత్ర విశేషమని సభలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంచనగిరి సతీష్, వంచనగిరి కవిత, వంచనగిరి రాజు, వంచనగిరి సరిత, వంచనగిరి అశోక్, వంచనగిరి ఉష, వంచనగిరి రమేష్, వంచనగిరి రామా తదితర కుటుంబ సభ్యులు అభిమానులు , సత్యం, అశోక్, సురేష్, సురేష్ నాయక్ సతీసమేతంగా వైనాల లింగన్న, వైనాల పద్మ ని శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వారు చేసిన మంచి పనులకు కృతజ్ఞతలు తెలుపుతూ అందరూ కొనియాడారు.కార్యక్రమంలో మాట్లాడిన వైనాల లింగన్న, వైనాల పద్మ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. గృహప్రవేశ వేడుకను విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం



**నల్గొండ ప్రభాత సూర్య :** ఈరోజు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు మరియు కళాశాల దూరవిద్య కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి ధర్మానాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం గురించి మాట్లాడటం జరిగింది. ఇందులో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల అందరిని ఆహ్వానించి వచ్చే నెలలో ఒక పెద్ద సమావేశం నిర్వహించుటకు సమాలోచన చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుండి డిగ్రీ పాసైన ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు మరియు మేధావులు, ఉద్యోగస్తులు, ఇతర అన్ని రంగాల్లో స్థిరపడిన వారందరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించి భవిష్యత్తులో ఓపెన్ యూనివర్సిటీ నీ డిజిటల్ యూనివర్సిటీగా రూపొందించడానికి కావలసిన అన్ని చర్యలు ఈ ఈ సమావేశం లో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ రామకృష్ణ, పెరిక మధు, తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవలాల్ జయంతిని విజయవంతం చేయాలి



**మిర్యాలగూడ ఫిబ్రవరి 21:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయిలో మిర్యాలగూడలో ఈ నెల 23న శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287 జయంతిని జయప్రదం చేయాలని సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొర్ర నాగునాయక్, డి.రవితేజ నాయక్ కోరారు. శనివారం మిర్యాలగూడ పట్టణం ఎఫ్సిఐలో హమాలీలకు సేవాలాల్ జయంతి ఉత్సవాల గురించి ఆహ్వాన పత్రాలు అందించి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అత్యంత వైభవంగా నిర్వహించె సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పాల్గొని బోగ్ బండారూ కార్యక్రమంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూచించారు. గిరిజన వేషాధారణ, డప్పు వాయిద్యాలు, కోలాట బృందాలతో ఎంపీడీఓ కార్యాలయం నుండి బంజారా భవనం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు దాస్య నాయక్, భాస్కర్ నాయక్, బాలాజీనాయక్, విజయ్ నాయక్, బాలనాయక్ పాల్గొన్నారు.

# పిస్తా హౌస్‌ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ ప్రభాత సూర్య:** సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి కానున్న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పిస్తా హౌస్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని హైదరాబాదు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు కోట్లాది రూపాయలతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సూపర్ స్మార్ట్ సిటీ తో పాటు గ్రీన్ సిటీగా చేస్తామని అన్నారు. హైదరాబాద్ కు దీటుగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. చెత్త రహిత సిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను ఆదర్శంగా తీసుకునే విధంగా రెండు సంవత్సరాల కాలంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పిస్తా హౌస్ బ్రాంచ్ ను నల్గొండలో కూడా ఏర్పాటు చేయడం పట్ల ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇ టికల మంగమ్మ శ్రీనివాస్ తోపాటు పలువురు కార్పొరేటర్లు, పిస్తా హౌస్ నిర్వాహకులు కొణతం నాగిరెడ్డి, వినయ్ రెడ్డి, 6 మిథున్ రెడ్డి, నవ కిషోర్ రెడ్డి, కొణతం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కోసం రైతుల ధర్నా..!



**వేములపల్లి ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య న్యూస్:** పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని,కొత్తగా తీసుకొచ్చిన యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. కోపరేటివ్ సొసైటీ ముందు నార్కెట్పల్లి- అద్దంకి రహదారి పై రైతులు బైఠాయించారు.యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసేందుకు తమ వద్ద స్మార్ట్ ఫోన్లు లేవని,దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో యూరియా సరఫరా చేయడం లేదని విమర్శించారు. ఘటన స్థలానికి ఏవో కిషోర్ నాయక్ , ఏఈఓ నితిన్,ఎస్ఐ వెంకటేశ్వర్లు చేరుకొని రైతులకు నచ్చచెప్పారు.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో ప్రతిభ చాటిన మిర్యాలగూడ




**క్రీడాకారులు మిర్యాలగూడ ,ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య)** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువ క్రీడాకారులను పల్లె నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగేలా నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడా పోటీలు హైదరాబాదులో జరగాగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఈ .గుణాకర్, బాలుర విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, అవంతిపురం శ్రీ ప్రకాష్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని ఎస్.కె ఆఫ్షన్ బుష్రా బ్రాంజ్ మెడల్ సాధించటం పట్ల పాఠశాల కరస్పాండెంట్ కొల్లిపాక రమాకాంతరావు, ప్రిన్సిపల్ కే శారద ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## జగద్గిరిగుట్ట లో శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన


### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రింగుబస్తి లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. దైవాన్ని ఆరాధించడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్, పాపిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాపయ్య గౌడ్, సింగిరెడ్డి మల్లారెడ్డి, వెంకటేష్, యాదగిరి, శ్రావణ్, సుభాష్ గౌడ్, శ్రీనివాస్, రాఘవేందర్, సునీల్ రెడ్డి, రాజు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి ని మర్యాదపూర్వకంగా కలిసిన బొడ్డు బొందయ్య

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానుకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ను హైదరాబాదు కార్యాలయంలో ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో ఘనంగా సత్కరించారు.



# ఎరువుల బుకింగ్ యాప్ ఎత్తివేయాలి

**రైతులకు సరిపడా యూరియా అందించాలి**

**మున్సిపల్ ఎన్నికల్లో ధన బలం ప్రలోభాలతో గెలిచారు**

**మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి**



**మిర్యాలగూడ ఫిబ్రవరి 21:-( ప్రభాత సూర్య):** యూరియా కొరత తీవ్రంగా ఉన్నదని, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ పొలాలు పొట్టదశలో ఉన్నాయని ఈ సమయంలో వ్యవసాయానికి యూరియా ఎంతో అవసరం అన్నారు. యూరియా కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, చాలామంది అవగాహన లేని రైతులు యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఉన్నారని ఆయన అన్నారు. యాప్ ద్వారా యూరియా కోసం సబ్మిట్ టచ్ చేయగానే యూరియా స్టాక్ లేనట్లు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన వివరించారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు యూరియా కొనుగోలు కోసం యాప్ ప్రక్రియను ప్రవేశపెట్టారో వెంటనే ఎత్తివేయాలన్నారు. రైతులకు కావలసినంత యూరియాను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి రైతులకు యూరియా కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాలతో ధనబలంతో గెలిచారని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి విమర్శించారు. నైతిక విలువలు లేవని తప్పుడు పద్ధతులతో వ్యాపార దృక్పథంతో ఉన్న వారిని ప్రజలు గెలిపించారని ఆయన అన్నారు. ధన బలంతో గెలిచినవారు రాబోయే రోజులలో అందుబాటులో ఉండరని వార్డులలో ఎలాంటి సమస్యలు పరిష్కరించరని ఆయన అన్నారు. ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. డబ్బు పెట్టి గెలిచినవారు స్వప్రయోజనాల కోసం ఆలోచిస్తారే తప్ప ప్రజల గురించి ఆలోచించరన్నారు. నిరంతరం అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసే వారిని గెలిపించాలని, రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో సేవ చేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, పాండు, సిపిఎం అనుబంధ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాజీ పట్టణ కార్యదర్శి జగదీష్ చంద్ర, సిపిఎం వేములపల్లి మండల కార్యదర్శి శశిధర్ రెడ్డి, రామ్మూర్తిలు ఉన్నారు.

# చిన్ననాటి నుంచే మంచి విలువలు క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత నేర్పించాలి

### సర్వ్ నీడి స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌతమ్ కుమార్ మరియు సి వి రెడ్డి ( రిటైర్డ్ ఆర్మీ)

### శిల్పకళా వేదికలో ఘనంగా ఐరిస్ ఫ్లోరెట్స్ స్కూల్ వార్షికోత్సవం




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య):** చిన్ననాటి నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత నేర్పితే వారు భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని సర్వ్ నీడి స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌతమ్ కుమార్ అన్నారు. ఐరిస్ ఫ్లోరెట్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వారు శిల్పకళ వేదికలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న పిల్లలు చేసిన ప్రదర్శనలు సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దిన సంస్థ యజమాన్యానికి, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం గౌతమ్ కుమార్, సి కె రెడ్డిలను శాలువా, మెమెంటో తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం సభ్యులు తుర్లపాటి రాధిక శిరీష్, తుమ్మేటి జ్యోత్స్న శరత్ రెడ్డి తో పాటు ఇతర బ్రాంచ్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేదాంతు హై స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం

**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణ కేంద్రంలో శనివారం ప్రిన్సిపల్ శోభన్ అధ్యక్షతన వార్షికోత్సవ మహోత్సవం ఆర్య సమాజ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ శివరాం రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధమ గురువులు తల్లిదండ్రులే, విద్యార్థుల ఆసక్తి గల రంగంలో రాణించాలని, ఆటపాటల ద్వారా డూయింగ్ బై లెర్నింగ్ అనే పద్ధతి ద్వారా సృజనాత్మకతను, వారి నైపుణ్యాలను వెలికి తీయడమే ఈ వార్షికోత్సవ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి చదువులు ఆపాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థితిలో ఉండాలని తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని, దేశ సేవలో నిమగ్నం కావాలని తెలిపారు. అనంతరం మండల విద్యాధికారి కత్తుల అరుంధతి మాట్లాడారు విద్యార్థులు మొబైల్ కు దూరంగా ఉండాలని, మంచి ఉత్తీర్ణత సాధించి వేదాంత హై స్కూల్ కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీ ఆవిష్కరణ

## విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక గ్రంథం ఈ డైరీ

## విద్యా వ్యవస్థ పై సమగ్ర సమాచారం ఇందులో పర్చబడింది

## జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. మంద రంజిత్ కుమార్





**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** 2026 సంవత్సరానికి సంబంధించిన జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీనీ శనివారం విసి చాంబర్లో జేఎన్టీయుహెచ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ సీనియర్ ప్రొఫెసర్ విజయ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర రావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఈ డైరీ సాధారణ పుస్తకం కాదని విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక గ్రంథం అనీ రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా వ్యవస్థపై సమగ్ర సమాచారం ఇందులో పొందుపరచబడిందనీ అన్నారు. ఇంటర్ తర్వాత ఏ పరీక్ష? ఏ కోర్సు? ఎన్ని సంవత్సరాలు? ఏ రాష్ట్రంలో, ఏ కాలేజీలో అందుబా టులో ఉంది? అన్న వివరాలు స్పష్టంగా అందించబడ్డాయని తెలిపారు. జేఎన్టీయుహెచ్ అనుబంధ, ఆటోనమస్ కళాశాలల పూర్తి వివరాలతో పాటు హైకోర్టు, గవర్నర్, సీఎం పేషీ, రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల వివరాలు కూడా చేర్చబడ్డాయని తెలిపారు. ఒక వ్యక్తికి అవసరమైన సమగ్ర సమాచారం ఒకే డైరీలో అందుబాటులో ఉండేలా రూపకల్పన చేయడం జరిగిందనీ, గత నాలుగు సంవత్సరాలుగా నిరంతర విజయంతో జేఎన్టీయుహెచ్ జేఏసీ డైరీని ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. మా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జి. చెన్నయ్య, మెడి పాపయ్య సహకారంతో సంఘం మరింత బలంగా ముందుకు సాగుతోందని డాక్టర్. మంద రంజిత్ కుమార్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కడైనా అన్యాయాన్ని ఎదుర్కొంటే జేఎన్టీయుహెచ్ జాక్ కమిటీ ముందుంటుందని, హక్కుల కోసం పోరాటం ఆగదనీ, సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ బొజ్జ ప్రణయ భాస్కర్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొడెం సాయి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మూడు నరేష్, జనరల్ సెక్రటరీ దిలీప్, ఈసీ సభ్యులు శ్రీనివాస్, బురుగుల వెంకటేశ్వర్లు, జేఎన్టీయుహెచ్ జేఏసీ అడ్వైసర్ సరల, ఎంఆర్పియస్ నాయకులు యాదగిరి, లాజర్, సుదర్శన్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారులను గుర్తించడానికి ఒక సబ్ కమిటీని చేసి ప్రక్రియ ప్రారంభిస్తాం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** తెలంగాణ రాష్ట్ర జిల్లా ఉద్యమకారులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని, ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఉద్యమకారుల అంశం రాజ్యసభలో ఆమోదం తెలిపిన రోజు సందర్భంగా పొన్నం ప్రభాకర్ తో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ నెలలోనే ఉద్యమకారులను గుర్తించడానికి ఒక సబ్ కమిటీని వేసి ఉద్యమకారుల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ని, కోదండరాం సార్ ని కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి యు ఎఫ్ నాయకులు ఓరుగంటి ఆనంద్, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మదాసు శ్రీనివాస్, జెనిగె విష్ణువర్ధన్, కారింగుల నరేందర్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, నక్క జంగయ్య గౌడ్, జొరక రాము ముదిరాజ్, జానకి రెడ్డి, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాదంపై యువతకు అవగాహన- --డివైఎఫ్ఐ సామూహిక అధ్యయనం



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** యువతలో రాజకీయ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో రెడ్ బుక్ డే సందర్భంగా నిర్వహించిన సామూహిక అధ్యయన కార్యక్రమం చైతన్య వాతావరణాన్ని సృష్టించింది. శనివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో కూకట్ పల్లిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు చైతన్య రెడ్డి మాట్లాడుతూ, సామ్రాజ్యవాద విధానాలు ప్రపంచ దేశాల ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై చూపుతున్న ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించారు. అభివృద్ధి పేరుతో బలహీన దేశాల వనరులను దోచుకునే విధానాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో బాధ్యతాయుత పాత్ర పోషించగలరని తెలిపారు. పుస్తక పఠనం కేవలం సాహిత్యాస్వాదనకే పరిమితం కాకుండా, చరిత్రాత్మక అవగాహనను పెంపొందించే సాధనమని ఆయన పేర్కొన్నారు. సామూహిక అధ్యయనాల ద్వారా చర్చా సంస్కృతి బలోపేతం అవుతుందని, యువతలో విమర్శనాత్మక దృష్టికోణం పెరుగుతుందన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలు, ఆర్థిక అసమానతలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆలోచనాత్మక చర్చలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. యువత కేవలం ప్రేక్షకులుగా కాకుండా సమాజ మార్పులో భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్ బుక్ డే ప్రాముఖ్యతను వివరించి, ఇటువంటి అధ్యయన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను, పవన్, ఆతిథ్య, అశోక్, హనుమంతు, జగన్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



## ఎంజేపీటీలో తల్లితండ్రుల- ఉపాధ్యాయుల సమావేశము



**చౌటుప్పల్.ఫిబ్రవరి 21. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ బాలుర పాఠశాల,కళాశాలలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశమును పాఠశాల ప్రిన్సిపాల్ బి శిరీష ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి,ప్రవర్తన, తరగతిలో క్రమశిక్షణ, విద్యార్థుల హాజరు శాతం, సమగ్ర అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభ్యాస ప్రణాళిక, విద్యార్థుల అకాడమిక్ మార్కులు వంటి కీలక అంశాలపై వివిధ తరగతులను బోధించే ఉపాధ్యాయులు తల్లిదం డ్రులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడు తూ.. పాఠశాలలో తమ విద్యార్థులకు అందుతున్న పలు వసతులు,విద్యపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ... ఇలాంటి సమావేశాలను నిర్వహించడం వలన చదువులో వెనకబడి ఉన్న పిల్లలకి అవసరమైన మార్గదర్శకత్వం, అలాగే ప్రవర్తనా సమస్యలను పరిష్కరించడానికి,విద్య వ్యూహాలను రూపొందించడానికి ఇలాంటి సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

### సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన

### 300 మందికి వైద్య పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి స్కూల్ లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. శనివారం పాఠ శాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో ఉచితం గా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన వివేకానంద మాట్లాడుతూ నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు చాలా అవసమన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సంస్కృతి స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరం లో సుమారు 300మందికి సాధారణ, కంటి, దంత, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిదంగా సుమారు 350 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృంధం తదితరులు పాల్గొన్నారు.




## బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలి

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. రాజయ్య

పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత వికృత రూపమే సామ్రాజ్యవాదమని, ట్రంప్ నాయకత్వంలోని అమెరికా చర్యలు ప్రపంచవ్యాప్తంగా విధ్వంసాన్ని, ఆక్రమణలను సృష్టిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. రాజయ్య అన్నారు.శనివారం పటాన్‌చెరు పట్టణంలోని 'శ్రామిక భవన్'లో నిర్వహించిన 'రెడ్ బుక్ డే' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమెరికా తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ఇతర దేశాలపై సుంకాల పేరుతో ఆర్థిక బెదిరింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా భారతదేశంపై అదనపు సుంకాలు విధించి ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వేదికలపై రష్యా, చైనా వంటి దేశాలు అమెరికా ధోరణిని దీటుగా ఎదుర్కొంటుంటే, మన దేశ ప్రధాని మోడీ మాత్రం అమెరికా చర్యలపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్, అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను తాకట్టు పెడుతోందని విమర్శించారు. సామ్రాజ్యవాద దురాగతాలను ఎండగట్టాల్సిన సమయం ఆసన్నమైందని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలందరూ ఐక్యమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వాజిద్ అలీ, శ్రీనివాస్, శ్రీధర్ , మూర్తి, బంగార్రాజు, సుధాకర్, పెంటయ్య , నవీన్ స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 21:** పల్లెల సర్వతోముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యపిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.





## శిక్షణ పూర్తి చేసుకున్న నేలకొండపల్లి మండల సర్పంచులు

### కలెక్టర్ చేతుల మీదుగా ట్రైనింగ్ సర్టిఫికెట్ అందుకున్న రాజారాంపేట సర్పంచ్ రాయపూడి రామారావు

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర భవనంలో నూతన సర్పంచ్ ల శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనిరుధ్ చేతులు మీదుగా పత్రాలను అందచేశారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి కూసుమంచి తిరుమలాయపాలెం ముదిగొండ కామేపల్లి మండలంలోని సర్పంచులకు ఐదు రోజులు పాలన వ్యవస్థ గురించి శిక్షణా తరగతులు పూర్తి చేశారు. దీనిలోని భాగంగా నేలకొండపల్లి మండలంలోని రాజారాంపేట సర్పంచ్ రాయపూడి రామారావుకి సర్టిఫికెట్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలోని సర్పంచ్ లు బోయిన వేణు సైదులు కట్టేకోల నాగార్జున లావూరి కోటేశ్వరరావు దండ రంగయ్య శ్రీనివాస్ రమేష్ కమదన ప్రవీణ్ బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ లకు ఘనంగా సన్మానం




**పెబ్బేరు. ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య :** పెబ్బేరు మున్సిపాలిటీ లోని 6వ వార్డు తాటికొండ కృష్ణయ్య, 7వ వార్డు శివసాయి లను బేడబుడగ జంగం హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు కొడిగంటి నరసింహ , బైల్ పాటి బన్ని, సిరిగిరి శివ , మోతెశ్రీను, మెతెరాములు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ,మోతె బ్రహ్మయ్య వారి నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....బేడబుడగ జంగం కులస్తులకు రిజర్వేషన్లు కల్పిస్తూ కౌన్సిలర్లుగా పదవి బాధ్యతలు స్వీకరించడం మా కులానికి ఎంతో గర్వకారణం అని, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అవకాశం కల్పించిన వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే అసెంబ్లీలో పార్లమెంట్ లో కూడా రిజర్వేషన్ ద్వారా మాకు స్థానం కల్పించాలని వారు కోరారు.

## పేదింటి ఆడపడుచు పెళ్లికి మేఘన కానుక

### 3 వేలు,పెళ్లి వస్త్రాలు అందజేసిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య:** పెబ్బేరు మున్సిపాలిటీలో పేదింటి ఆడపడుచు పెళ్లికి అండగా నిలబడాలనే సామాజిక బాధ్యతతో శనివారం పెబ్బేరు నూతన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్..తమ సొంత ఖర్చుతో పేదింటి ఆడపిల్ల పెళ్లికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేరుతో 'మేఘాన్న పెళ్ళి కానుక' తో రూ,3 వేలు,పెళ్లి వస్త్రాలను మున్సిపాలిటీలోని 6వ వార్డులో సంకుల శాంతమ్మ, శీను దంపతుల కూతురు దీపిక పెళ్ళికి ఆర్థిక సాయం చేశారు. పేదింటి ఆడపిల్ల పెళ్లికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అందించిన 'మేఘాన్న పెళ్లి కానుక' ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి ఎంతో కొండంత అండగా నిలిచింది. మీ ఉదారతకు, పేదల పట్ల మీకున్న మమకారానికి పెళ్లికూతురు దీపిక కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ మీ సేవలు ఇలాగే కొనసాగాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్.. తాటికొండ కృష్ణ,నాయకులు సుధాకర్ గౌడ్దూపం రాజలింగం, తాటికొండ ఆంజనేయులు, సంకుల శ్రీను, దూపం రంగస్వామి, కప్పరి గోకరి, మోతె శ్రీను,దూపం దశరథం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పాలకవర్గం కీలకపాత్ర పోషించాలి



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 21:** గ్రామం అభివృద్ధి చెందాలంటే పాలకవర్గం కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ శంకర్ అన్నారు. మండల కేంద్రమైన హత్నూర మండల ప్రజా పరిషత్ రైతు వేదికలో మొదటి విడతలో భాగంగా నూతనంగా ఎన్నుకోబడ్డ గ్రామపంచాయతీ వార్డు మెంబర్లకు గత ఐదు రోజుల పాటు కొనసాగిన శిక్షణ తరగతులను శనివారం ముగుసాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామ పాలక వర్గం ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే విధంగా చూడాలన్నారు,గ్రామ పాలక వర్గ సభ్యులకు పరిపాలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ అందరూ కలిసిక ట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్న ప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీకి ప్రభుత్వము నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధికి వినియోగిం చుకోవాలని, గ్రామంలో ఏదైనా సమస్య ఉన్నచో వార్డు సభ్యులు ఉప సర్పంచ్ లు కీలకపాత్ర వహించాలి సూచిం చారు. ఉదాహరణకు గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు త్రాగునీరు,డ్రైనేజీ సమస్య,వీధుల వెంబడి చెత్త, చెదారం లాంటి సమస్యను ప్రతిరోజు క్రమం తప్పకుండా మరమ్మత్తులు చేపించాలని అలా జరిగినప్పుడే గ్రామం సశ్యామలంగా ఉండి ,గ్రామంలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతారని అలాంటప్పుడే మన గ్రామ పంచాయతీ అభివృద్ధి చెందినట్టుగా మనం గ్రహించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీ ఓ యూసుఫ్,ఏపీఎం రాజశేఖర్. వివిధ గ్రామాల పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు,, తదితరులు శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వాసవి క్లబ్, వనిత క్లబ్ కమిటీలు ఏకగ్రీవంగాఎన్నిక

**పెబ్బేరు ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య:** వాసవి క్లబ్, వనిత క్లబ్ పెబ్బేరు నూతన కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రీజినల్ ఛైర్మన్ చంద్రమౌళి, పెద్దకొత్తపల్లి ఛైర్మన్ ప్రేమ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు నాగేష్, మల్లేష్ లు శుక్రవారం రాత్రి పెబ్బేరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవిక్లబ్, వనిత క్లబ్ గౌరవ అధ్యక్షులుగా రాజశేఖర్, శ్రీదేవి, అధ్యక్షులుగా డి. మహేష్, రాధిక, ప్రధాన కార్యదర్శులుగా జె. హరికృష్ణ, వసుంధర, ఉపాధ్యక్షులుగా ఆర్. నవీన్, లక్ష్మీ, డి. శంకర్, లక్ష్మీ, కోశాధికారులుగా బి. విజయభాస్కర్, కవిత, సభ్యులుగా సి. కృష్ణంరాజు, హరితలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని క్లబ్ నేతలు శాలువాలతో సన్మానంచారు. పట్టణ ఆర్యవైశ్యులు నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.



## వాసవి క్లబ్, వనిత క్లబ్ కమిటీలు ఏకగ్రీవంగాఎన్నిక

**పెబ్బేరు ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య:** వాసవి క్లబ్, వనిత క్లబ్ పెబ్బేరు నూతన కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రీజినల్ ఛైర్మన్ చంద్రమౌళి, పెద్దకొత్తపల్లి ఛైర్మన్ ప్రేమ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు నాగేష్, మల్లేష్ లు శుక్రవారం రాత్రి పెబ్బేరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాసవిక్లబ్, వనిత క్లబ్ గౌరవ అధ్యక్షులుగా రాజశేఖర్, శ్రీదేవి, అధ్యక్షులుగా డి. మహేష్, రాధిక, ప్రధాన కార్యదర్శులుగా జె. హరికృష్ణ, వసుంధర, ఉపాధ్యక్షులుగా ఆర్. నవీ న్, లక్ష్మీ, డి. శంకర్, లక్ష్మీ, కోశాధికారులుగా బి. విజయభాస్కర్, కవిత, సభ్యులుగా సి. కృష్ణంరాజు, హరితలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని క్లబ్ నేతలు శాలువాలతో సన్మానంచారు. పట్టణ ఆర్యవైశ్యులు నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.

## వార్డులలో సమస్య తీర్చిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు ఫిబ్రవరి 21 ప్రభాకర్ సూర్య:** పెబ్బేరు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, వీధి దీపాలు మరియు చెత్త నిల్వల సమస్యలపై నూతన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించారు. 1, 11వ వార్డులో ?నీటి లీకేజీల అరికట్టడం పైప్‌లైన్ లీకేజీల వల్ల వృధా అవుతున్న మంచినీటిని అరికట్టేందుకు తక్షణమే మరమ్మతులు నిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, సమస్య తీవ్రతను బట్టి గంటల వ్యవధిలోనే పరిష్కారం చూపడం పట్ల ప్రజలు సంతోషిస్తున్నారు





**ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ జాతీయ సేవా పథకం భాగంగా షరాజీపేట లో ఉచిత హెల్త్ క్యాంపు.....**



**ఆలేరు ఫిబ్రవరి 21 ప్రభాత సూర్య:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ జాతీయ సేవా పథకం భాగంగా 5వ రోజు సందర్భంగా శనివారం రోజున షరాజీపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరిగింది. అనంతరం హెల్త్ సెంటర్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పారిశుద్ధ పనుల కోసం హెల్త్ ఆవరణ సెంటర్లో పిచ్చి మొక్కలను, చెత్త ను తొలగించడానికి శ్రమ దానం చేశారు. అనంతరం గ్రామ ప్రజలు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ నల్లబోలు ముత్యాలు, వాలంటీర్స్ చైతన్య, ఉష, నాజియా, అక్షయ, పకృతి రాజా, సంతోష్, సాయి, సామ్య, శిరీష, వర్షా, లక్ష్మణ్, బాలాజీ, మనోజ్, రామ్ చరణ్, గణేష్, ఇర్ఫాన్ , శివ, ప్రియ, సుకన్య, సిరి సంధ్య ,దుర్గాప్రసాద్ ,దిలీప్ కుమార్ ,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ సర్పంచ్ విరమల్ల శ్రీషేలం ఆధ్వర్యంలో ఘనంగా ధూమ్ ధాం సాంస్కృతిక పాటలు



**గట్టుప్పల్ ప్రభాత సూర్య ఫిబ్రవరి21:**గట్టుప్పల మండలం లోని తెరటపల్లి గ్రామంలో మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం మాడ పాపయ్య పవన్ శర్మ ఆధ్వర్యంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం శనివారం రథోత్సవం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం మాజీ సర్పంచ్ విరమల్ల శ్రీషేలం ఆధ్వర్యంలో జానపద కళాకారుల చే సింగర్ శిరీష, మల్లిక, లక్ష్మీ, శ్రీపల్, ప్రతాప్ శ్రీనివాస్ ధూమ్ ధాం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ విరమల్ల శేషేలం మాట్లాడుతూ ఆలయల అభివృద్ధి కి తోడ్పాటునిస్తానని తెలిపారు. మండల ప్రజాలకు ఏ ఆపద ఉన్న సహాయపడుతనాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగం వెంకటేశం, సర్పంచ్ నామని జగన్నాధం, ఎస్ఐ సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ మలిగే శ్రీషేలం కంచుకట్ల సంపత్, మాజీ ఎంపీటీసీ గోరిగే సతయ్య,చాలమల్ల వెంకటరమణ రెడ్డి దేవస్థాన కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం: మీా మేఘారెడ్డి

వనపర్తి: నిరుపేదల సొంతింటి కల నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని, గతంలోనూ ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదలకు ఇండ్లు మంజూరయ్యాయని నేడు రేవంత్ రెడ్డి సర్కార్ లోనే రూ. ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ నీరు పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మండలం చందాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న పుల్లరి నీలమ్మ నాగరాజు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి నిర్మాణం కోసం కలలుగన్న మా కుటుంబానికి నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి మాకు ఓ సొంత గూడును ఏర్పాటు చేసుకునేందుకు 5 లక్షల రూపాయలు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి, వనపర్తి నిరుపేదల ఆశాజ్యోతి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ప్రతిభవంతుల గుర్తింపే ప్రభుత్వ లక్ష్యం

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే భాగంగా క్రీడా పోటీలను నిర్వహించి, ప్రతిభావంతులను గుర్తింపు జరిగే విధంగా చీఫ్ మినిస్టర్ కప్ 2025 రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ప్రాజెక్టు పై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసినప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్పు పేరిట గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి, ప్రతిభా గల క్రీడాకారులకు ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నట్లు వారు చెప్పారు.. ప్రతిభ ను గుర్తించి శిక్షణ ఇవ్వడానికి శిక్షకుల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది అని చెప్పారు.

# గమ్యాల గాబరాలో

# గల్లంతవుతున్న మనసులు

## వెతికే పనిలో బ్రతకడం మరిచిన మనిషి

### భవిష్యత్తును వెతుకుతూ వర్తమానంలో జీవించడం మరిచిపోతున్న నేటి తరం



హైదరాబాద్, ఫిబ్రవరి 21(ప్రభాత సూర్య): నీతో నువ్వు గడిపే క్షణాలు మరిచిపోతున్నావు నిన్ను నువ్వు ప్రేమించడమే మరిచిపోయావు .. ఎందుకో తెలియదు... ఎక్కడికో పరుగులు తీస్తున్నావు! ఈ పోటీ ప్రపంచంలో మనిషి ఎందుకు పరిగెడుతున్నాడో, ఎక్కడికి చేరాలని పరితపిస్తున్నాడో అతనికే తెలియడం లేదు. పరుగులు పెడుతూ లక్ష్యాలను చేరినా జీవించడం మరిచిపోతున్నారు చాలా మంది జీతం కోసం జీవితాన్ని తాకట్టు పెట్టవద్దు అవసరాల కోసం వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు ఇది విజ్ఞాన శతాబ్దం... అభివృద్ధి, వేగం, టెక్నాలజీ అనే పదాలు ప్రతి నోటా, ప్రతీ చోట వినపడుతున్నాయి. మొబైల్ అలారంతో మొదలయ్యే రోజు టార్గెట్లు, డెడ్‌లైన్లు, మీటింగ్స్ తో ముగుస్తోంది. కానీ ఈ శబ్దాల మధ్య ఓ మౌనం వినిపించదా? అదే బ్రతకడం మరిచిపోవడమే!

### ఉద్యోగం కోసం బ్రతకడమా, బ్రతకడం కోసం ఉద్యోగమా?

ఒకప్పుడు జీవించేందుకు పనిచేసేవాడు ఇప్పుడు పని చేసేందుకే జీవిస్తున్నాడు కుటుంబం కోసం పని చేస్తున్నాం... కానీ కుటుంబంతో గడిపేందుకు సమయం లేదు. ఆర్థిక స్వావలంబన కోసం పరుగులు పెడుతున్నాం కానీ అయినవారికి దూరమవుతున్నాం పిల్లల ఆలనా,పాలనా చూడకుండా ఉద్యోగానికి వెళ్లే తల్లిదండ్రులు, పిల్లలకు మంచి జీవితాన్ని ఇవ్వాలనే తపనలో పిల్లలతో సమయం గడపకుండా వారితో ప్రేమగా ఉండకుండా వారు ఎం చేస్తున్నారో చూడకుండా వుండడం పిల్లల భవిష్యత్ దారి తప్పుతుంది . వారి సంపాదనతో జీవనం సాఫీగా సాగుతోంది అనుకుంటాం కానీ సంతోషం మాత్రం లేకుండా పోతుంది బంధాలు జ్ఞాపకాలుగా మారుతున్న రోజులు ఇవి పండుగలు సెలవులుగా మిగిలిపోతున్నాయ్ స్నేహం వాట్సాప్ స్టేటస్ వరకే పరిమితమవుతోంది. అభినందనలు ఈమెయిల్‌ల రూపంలో పరిచయాలు లింక్డ్ఇన్ నోటిఫికేషన్లగా మారుతున్నాయి. మనుషుల మధ్య మానవత్వం తగ్గిపోతోంది అవసరాల కోసం స్వార్థం పెరుగుతుంది




## ఆత్మసంతృప్తే అన్నిటికన్నా గొప్ప విజయం

- సక్సెస్ గురించి తెలుసు... కానీ సంతోషం గురించి?
- ఉన్నత స్థితిలో ఉన్నా కానీ మనసు ప్రశాంతంగా ఉందా?
- పేరుప్రతిష్ఠ, సంపాదన, పదవులు... ఇవన్నీ ఉన్నా,నీకు నువ్వు సమయం ఇవ్వకపోవడం, నిన్ను నువ్వు ప్రేమించుకోలేకపోవడం, చేసే పనిలో సంతృప్తి లేకపోవడం ఎన్నటికీ నీకి ప్రశాంతతను ఇవ్వవు
- “నీవు ఎంత సంపాదిస్తున్నావు?” అనే ప్రశ్నకు సమాధానం ఉండవచ్చు
- “నీవు సంతోషంగా ఉన్నావా?” అనే ప్రశ్నకు?
- బ్రతకే పనిని వెతకండి... కానీ బ్రతకడం మాత్రం మర్చిపోవద్దు
- ఈ తరం చేసే లోతైన తప్పు -- లక్ష్యాల పేరుతో జీవితాన్ని మరిచిపోవడం
- పని మనల్ని నిర్విరామంగా పరిగెట్టిస్తోంది
- గమ్యాలు మనల్ని గాభరా పెట్టిస్తున్నాయి
- కానీ... జీవితం ఏమవుతోంది?
- వృత్తి పట్ల నిబద్ధత ఉండాలి
- కానీ జీవితం పట్ల ప్రేమ కూడా ఉండాలి
- లక్ష్యాలపై గురి ఉండాలి
- కానీ బంధాలు విలువలపై నమ్మకం , బాధ్యత కూడా ఉండాలి
- నీకు నీవు సమయం ఇచ్చుకోవడం
- బంధాలకు విలువ ఇవ్వడం
- ?జీవిత ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించడం
- అనేవి ప్రతీ మనిషి ఉత్తమమైన జీవిత ప్రయాణానికి పునాదులు
- జీవితం ఒక గమ్యం కాదు -- అనుభూతుల ప్రయాణం
- నువ్వు ప్రేమించాల్సింది గమ్యాన్ని కాదు గమ్యాన్ని చేరే ప్రయాణాన్ని అప్పుడే నీ గమ్యం సులువుగా చేరుకోగలవు
- గడిచిన కాలం జ్ఞాపకాలను, నడిచే కాలం అనుభూతులను ఇవ్వాలి
- విజయం ఒక గుర్తింపు కాదు -- అంతర్గత సంతృప్తి
- మనమంతా ఎదుగుదల కోసం పరితపిస్తున్నాం
- కానీ ఎక్కడినుంచి మొదలైందో మన ప్రయాణం అన్నది మాత్రం మరవొద్దు
- పనిలో విజయాలు రావొచ్చు... కానీ జీవితం మాత్రం?
- ఆత్మీయతలు కోల్పోతే, ఆ విజయాలకు విలువేంటి?
- బతికే పనిని వెతకండి, కానీ వెతికే పనిలో బ్రతకడం మర్చిపోవద్దు! గమ్యాలను చేరండి కానీ ప్రయాణాన్ని ఆస్వాదించడాన్ని మాత్రం మరవద్దు!

నిన్ను నువ్వు తెలుసుకోలేనప్పుడు, నీకు నువ్వు విలువ ఇచ్చుకోలేనప్పుడు , నీ మీద నీకు ప్రేమ లేనప్పుడు నువ్వు జీవితంలో ఎంత ఉన్నత స్థితిలో వున్నా నిరుపయోగమే .

యస్వర్ధన్

# కూకట్ పల్లి కెపిహెచ్బి లో ప్రజా సమస్యలపై గాదె శివ పాదయాత్ర

## అబ్దుల్ కలాం పార్క్‌లో సమస్యల పరిశీలన, తక్షణ చర్యలు

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్బి 6వ ఫేజ్‌లో ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ ను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ నేత గాదె శివ మిత్రబృందంతో కలిసి సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్న యువ నాయకుడు గాదె శివ, పార్కులో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

**పాదాచారులతో కలిసి పాదయాత్ర**

కెపిహెచ్బి 6వ ఫేజ్, వసంతనగర్, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాలకు చెందిన వాకర్స్ బృందంతో కలిసి గాదె శివ పాదయాత్ర నిర్వహించారు. పార్క్ వాకర్స్, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వినిపించుకున్న గాదె శివ, వాటిని స్థలంలోనే పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

**గుర్తించిన ప్రధాన సమస్యలు పరిష్కారానికి తీసుకున్న అంశాలు**

డ్రైనేజ్, పార్కు పరిశుభ్రత లోపాలు, జిమ్ ఎక్విప్మెంట్స్ దెబ్బతినడం, వాకింగ్ ట్రాక్ సమస్యలు, ప్రహరీ గోడ అనవసర ఎత్తు, బోర్‌వెల్స్ పాడవడం, వీధి దీపాలు పనిచేయకపోవడం వంటి అంశాలు దృష్టికి వచ్చాయి.

**జీహెచ్ఎంసీ అధికారులతో చర్చలు-- వెంటనే చర్యలు**

సమస్యలపై స్పందిస్తూ గాదె శివ వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులను, సానిటేషన్ సిబ్బందిని రప్పించి పార్క్



లోపల బయట పరిశుభ్రత పనులు ప్రారంభించారు. వీధి దీపాల సమస్యపై ఎలక్ట్రికల్ విభాగంతో చర్చించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. బోర్‌వెల్ సమస్యపై జీహెచ్ఎంసీ అధికారి విజయశ్రీ తో మాట్లాడగా, మోటార్ కాలిపోవడం కారణమని గుర్తించారు. మోటార్ రిపేర్ చేయడం లేదా అవసరమైతే కొత్త మోటార్ ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించారు.

**యోగా, మెడిటేషన్ సెంటర్ల సందర్శన**

పార్కులోని యోగా సెంటర్, మెడిటేషన్ సెంటర్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్‌తో వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, వాకర్స్‌తో కాసేపు సరదాగా ముచ్చటించారు.

**కాలనీ వాసుల అభినందనలు**

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించిన గాదె శివను చూసి సిక్స్ ఫేజ్, వసంతనగర్, భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు వాకర్స్ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా నిత్యం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**“ప్రజలకు -- పార్టీకి మధ్య వారధిని మాత్రమే” : గాదె శివ**

ఈ సందర్భంగా గాదె శివ మాట్లాడుతూ నేను ప్రజలకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య వారధిని మాత్రమేనని, ప్రజల సమస్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతాను అని తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రమేష్ కి, లక్ష్మయ్య కి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు సహాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ జనరల్ సెక్రటరీ మేడక కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామరావు చౌదరి, సురేష్, హరిప్రసాద్ నాయుడు, జనార్ధన్, రవి, జేఎస్సీ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, సాంబశివరావు, రామారావు, రాజు, మున్సిపల్ సిబ్బంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంపై మళ్లీ పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్? హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్?లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా? అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమిక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్?లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్?హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్? అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్?తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్?హౌస్?లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్?తో ట్రేడ్? డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్?- పాక్? యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్-పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## రూ.11.54 కోట్ల జీఎస్టీ ఎగవేత

### నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించిన వ్యక్తి అరెస్ట్

విశాఖపట్టణం,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): జీఎస్టీ ఎగవేతపై కేంద్ర జీఎస్టీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రూ.81.25 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించిన కేసులో మాస్టర్ మైండ్‌ను అరెస్టు చేశారు. నకిలీ బిల్లుల అంశంపై దర్యాప్తు చేసిన సీజీఎస్టీ యాంటీ-ఎవేషన్ అధికారులు.. ప్రభుత్వ ఖజానాకు రూ.11.54 కోట్ల నష్టం కలిగించినట్లు గుర్తించారు. సంబంధిత సంస్థల కార్యాలయాలు, ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కీలక ఆధారాలతో విశాఖకు చెందిన ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా... విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది.

## మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

### కామారెడ్డి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

మేడ్చల్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్

### అగ్నిప్రమాదంలో పది లక్షల ఆస్తి బుగ్గి

నల్లగొండ,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ): నల్గొండ జిల్లాలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి విఘ్నేశ్వర ఆటోమొబైల్ షాప్‌లో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్‌లో నుంచి ఒక్కసారిగా పొగ వ్యాపించింది. కాసేపటికే మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులో ఉన్న స్పేర్ పార్ట్స్, వాహనాలకు సంబంధించిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే షాప్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వైర్లలో లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థలను తరచూ తనిఖీ చేయించుకోవాలన్ని ఫైర్ సేఫ్టీ అధికారులు సూచించారు.

# రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ



హైదరాబాద్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ):రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

కామారెడ్డి: కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

## ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

### గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు

### వవరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21: ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది.

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

### మొత్తం 16మంది దుర్మరణం

లాహోర్,ఫిబ్రవరి21: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో శనివారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పాక్ సైనికులు, ఐదుగురు ఉగ్రవాదులు సహా మొత్తం 16 మంది మరణించారు. మృతులలో లెఫ్టినెంట్ కల్నల్ స్థాయి అధికారితో పాటు పౌరులూ ఉన్నట్టు సమాచారం. అనేక మంది సైనికులు గాయపడ్డారు. ఆ దేశంలో 15 రోజుల వ్యవధిలో ఇది మూడో ఆత్మాహుతి దాడి కాగా.. ఐదు రోజుల్లో రెండోది కావడం గమనార్హం. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని బన్ను జిల్లా సరార్ దర్గా ప్రాంతంలో ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో కూడిన ఓ వాహనాన్ని పాక్ భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో ఆత్మాహుతి దళ సభ్యుడు సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. అయితే.. సైన్యానికి చెందిన వాహనం దాడులను తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించినది కావడంతో పేలిపోలేదు. దీనివల్ల వాహనానికి తీవ్ర నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది.

## వైసిపి రాజకీయ పరాచకాలు ఆడుతోంది

### వేంకటేశ్వరాలయంలో ప్రత్తిపాటి పూజలు

పల్నాడు,ఫిబ్రవరి21: చిలకలూరిపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సంప్రోక్షణ చర్యలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆలయాన్ని శుద్ధి చేశారు ప్రత్తిపాటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునితో వైసీపీ రాజకీయ పరాచకాలు ఆడుతోందని మాజీ మంత్రి తీవ్రంగా విమర్శించారు. స్వామివారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం దుర్మార్గమని.. మహా పాపమని అన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయాలన్నదే వైసీపీ లక్ష్యమన్నారు. మండలిలో తమకు బలం ఉందని భావించి కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని రుజువైనా కావాలనే శాసనమండలిలో రచ్చ చేస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించడానికే హెరిటేజ్ సంస్థను రాజకీయాల్లోకి లాగారని తెలిపారు. రాజకీయాలకు తనను వాడుకుంటున్న వారిని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారనేది చరిత్ర ఎరిగిన సత్యమని హెచ్చరించారు.

## దత్తత గ్రామంలో కొణిదెలలో అభివృద్ధి

### ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతున్న పవన్

### సొంత ఖర్చులతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు

అమరావతి,: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించిన పవన్ కల్యాణ్, ఇప్పుడు కోట్లాది రూపాయల నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు.కొణిదెల గ్రామంలో దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పవన్ కల్యాణ్ తన ఉదారతను చాటుకున్నారు. ప్రభుత్వంపై భారం పడకుండా, తన సొంత విరాళం రూ. 50 లక్షలతో అత్యాధునిక ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంక్ ద్వారా సుమారు 2 వేల మంది గ్రామస్తులకు ప్రతిరోజూ స్వచ్ఛమైన తాగునీరు అందనుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.